# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 04-09-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ఉపాధ్యాయులు దేశ భవిష్యత్‌ను నిర్మించే రూపకర్తలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభివర్ణించారు.
- ❖ భావితరం జీఎస్టీ సంస్కరణలతో ఆత్మనిర్భర్ భారత్ ముందే సాకారం అవుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.
- ❖ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో నిన్న తీసుకువచ్చిన వస్తు సేవా పన్నుల సంస్కరణలు ఈనెల 22వ తేదీ నుండి అమలులోకి రానున్నాయి.
- ❖ భారత్ సిగపూర్ దేశాల మధ్య ఐదు అవగాహన ఒప్పందాలు కుదిరాయి.

========================

ఉపాధ్యాయులు దేశ భవిష్యత్‌ను నిర్మించే రూపకర్తలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభివర్ణించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులందరికీ రాష్ట్రపతి ఈరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ సామాజిక మాధ్యమం ఎక్స్ లో ఒక సందేశం విడుదల చేశారు. భారత్ అభివృద్ధి చెందుతున్న దేశంగా పయనిస్తోందని ఈ ప్రయాణంలో ఉపాధ్యాయులది కీలక పాత్ర అని ఆ సందేశంలో పేర్కొన్నారు. నైపుణ్యంతో కూడిన బాధ్యతాయుతమైన పౌరులను తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా వారికి పిలుపునిచ్చారు. జాతీయ విద్యా విధానం 2020 ద్వారా విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

========================

భావితరం జీఎస్టీ సంస్కరణలతో ఆత్మనిర్భర్ భారత్ ముందే సాకారం అవుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఈరోజు న్యూఢిల్లీలోని ఉత్తమ జాతీయ ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశం స్వాలంభన సాధించాలని, "వోకల్ ఫర్ లోకల్" నినాదాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లాలన్నారు. లక్షల కోట్ల రూపాయల మేర వంట నూనెలను భారత్ దిగుమతి చేసుకుంటోందని, ఆ నగదు మొత్తాన్ని ఆదా చేసుకున్నట్లయితే అనేక విశ్వ విద్యాలయాలను అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. భారత్ తయారైన వస్తులనే వినియోగించేందుకు దేశ ప్రజలు ఆసక్తి చూపాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

(వాయిస్ 38 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భావితరం జీఎస్టీ సంస్కరణల పేరిట నిన్న జరిగిన 56వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు ఈనెల 22వ తేదీ నుండి అమలులోకి రానున్నాయి. జీఎస్టీ కౌన్సిల్ సమావేశం అనంతరం కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ పాత్రికేయులకు వెల్లడించిన వివరాల ప్రకారం ఆహార ఉత్పత్తులు, ఔషధాలు, నిత్యావసర వస్తువులు, పాల ఉత్పత్తులు, గ్రీన్ ఎనర్జీ, ద్విచక్ర వాహనాలపై పన్నుల కోత ప్రకటించారు. క్యాన్సర్, అరుదైన వ్యాధుల చికిత్సతో సహా 36 ప్రాణాలను రక్షించే ఔషధాలపై జీఎస్టీని పూర్తిగా మినహాయించారు.  5 శాతం జీఎస్టీ ఉన్న నిత్యావసర వస్తువులను పూర్తిగా మినహాయించామని నిర్మలా సీతారామన్ ఈ సందర్భంగా వివరిస్తూ..

(వాయిస్ 37 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ సిగపూర్ దేశాల మధ్య ఐదు అవగాహన ఒప్పందాలు కుదిరాయి. సింగపూర్ ప్రధానమంత్రి లారెన్స్ వాంగ్ న్యూఢిల్లీలో ఈరోజు భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ సందర్భంగా అంతరిక్షం, పౌరవిమానయానం, నైపుణ్యాభివృద్ధి మొదలగు రంగాల్లో ఈ అవగాహనా ఒప్పందాలను చేసుకున్నారు. అనంతరం నిర్వహించిన ఉమ్మడి పాత్రికేయుల సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాట్లాడుతూ.. ఇండో పసిపిక్ ప్రాంతంలో స్థిరత్వం కోసం భారత్ - సింగపూర్ దేశాలు కలిసి పనిచేస్తాయన్నారు. ఆగ్నేయేషియా దేశాలలో సింగపూర్ భారతదేశానికి అతిముఖ్యమైన వాణిజ్య భాగస్వామి అని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 36 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

రహదారి భద్రతను పాఠ్యాంశాల్లో చేర్చి విద్యార్థులకుఅవగాహన కల్పించాలని కేంద్ర రోడ్డు రవాణా రహదారుల శాఖా మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. మాతృ భాషలో ఈ అంశంపై సరైన అవగాహన కల్పించినట్లయితే రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు.  న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన 7వ FICCI రోడ్ సేఫ్టీ అవార్డ్స్ సింపోజియం 2025లో నితిన్ గడ్కరీ పాల్గొన్నారు. రోడ్డు ప్రమాదాల సంఖ్యను తగ్గించేందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో ఆవశ్యకమన్నారు. దేశంలో జరుగుతున్న రోడ్డు ప్రమాద మరణాలలో 66 శాతం 18 నుండి 45 సంవత్సరాల వయసు లోపు వారే ఉన్నారని తెలిపారు. అందుకే విద్యార్థి దశ నుండే రహదారి భద్రతపై సంపూర్ణ అవగాహన కల్పించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్  నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ 2025 (ఎన్ఐఆర్ఎఫ్) ఇండియా ర్యాంకింగ్స్‌ను ఈరోజు న్యూఢిల్లీలో విడుదల చేశారు. ఈ ర్యాంకింగ్స్‌లో ఐఐటీ మద్రాస్ తొలి స్థానం దక్కించుకోగా ఐఐఎస్‌సీ బెంగళూర్ ద్వితీయ స్థానం దక్కించుకుంది. ఈ సందర్భంగా ధర్మేంద్ర ప్రదాన్ మాట్లాడుతూ.. 2014-15 నాటికి దేశంలో ఉన్నత విద్యను అభసించే వారి సంఖ్య 3.5 కోట్లు ఉండగా ప్రస్తుతం అది 4.5 కోట్లకు పెరిగిందన్నారు. 2030 నాటికి ఈ సంఖ్య రెట్టింపు కావాలని ఆకాంక్షించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

పంజాబ్ లో వరదల కారణంగా తీవ్రంగా ప్రభావితమైన ప్రాంతాలలో ప్రస్తుత పరిస్థితిని సమీక్షించేందుకు కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈరోజు ఆ రాష్ట్రంలో పర్యటించారు. అత్యంత ప్రభావిత ఐదు జిల్లాలైన అమృత్సర్, పఠాన్‌కోట్, గురుదాస్‌పూర్, తర్న్ తరణ్, ఫిరోజ్‌పూర్‌లలో వరద పరిస్థితిపై పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా కేంద్రమంత్రికి నివేదికలను సమర్పించారు. ఈ సమావేశానికి ముందు శివరాజ్ సింగ్ చౌహాన్ కపుర్తల గ్రామాన్ని సందర్శించారు.

========================

హిమాచల్ ప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో ఈరోజు వర్షాలు తగ్గుముఖం పట్టాయి. దీనితో ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు వేగవంతం అయ్యాయి. అయితే రాబోయే 24 గంటల్లో ఆ రాష్ట్రంలోని అనేక చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఇక మరోవైపు జమ్మూ కాశ్మీర్‌లో గత కొద్ది రోజులుగా కొనసాగుతున్న వరదలకు... పలు చోట్ల చిక్కుకుపోయిన ప్రయాణీకులు, స్థానికులను మాతా వైష్ణో దేవి మందిరం బేస్ క్యాంప్ అయిన కత్రా నుండి జమ్మూ మధ్య తరలించడానికి ప్రవేశపెట్టిన నాలుగు రైళ్ల షటిల్ సర్వీసులు బుధవారం భారీ వర్షం కారణంగా నిలిపివేయబడ్డాయి. జమ్మూ కాశ్మీర్‌లోని మరి కొన్ని జిల్లాల్లో రేపు కూడా భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.

========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు స్వల్ప లాభాలతో ముగిశాయి. వస్తు-సేవల పన్ను (జీఎస్టీ) స్వరూపంలో కీలక మార్పులు ప్రకటించడంతో ఉదయం ఉత్సాహంగా ప్రారంభమైన సూచీలు.. ఆ తర్వాత ఒడుదొడుకులకు గురయ్యాయి. సెన్సెక్స్ 80,567 పాయింట్ల వద్ద ప్రారంభమై.. చివరకు 151 పాయింట్లు లాభపడి 80,718వద్ద స్థిరపడింది. నిఫ్టీ 34 పాయింట్లు పెరిగి 24,749 వద్ద స్థిరపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం 88 రూపాయల 16 పైసలుగా ఉంది.

========================

గుజరాత్ లో ఈనెల 7వ తేదీ వరకు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) హెచ్చరించింది. అదేవిధంగా సౌరాష్ట్ర, కచ్ ప్రాంతాల్లో రానున్న రెండు రోజుల పాటు భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. పశ్చిమ బెంగాల్, జమ్మూ కాశ్మీర్, ఉత్తరాఖండ్, హరియాణా రాష్ట్రాల్లో రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది.

========================

వినియోగదారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర ఆహారం, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి ప్రహ్లాద్ జోషి స్పష్టం చేశారు. ఢిల్లీ, ముంబై, అహ్మదాబాద్ నగరాలకు రాయితీపై కిలో 24 రూపాయల ఉల్లిపాయలను విక్రయించే మొబైల్ వాహనాలను ఈరోజు మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. ఆహార ద్రవ్యోల్బణాన్ని, ధరల స్థిరీకరణను నిర్వహించడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలలో ఉల్లిపాయలను క్రమాంకనం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

========================
========================